క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికై వినతి



నందిగామ: ప్రజా సమస్యల పరిష్కారానికి పబ్లిక్ గ్రీవెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆర్డీవో ఏ రవీంద్రరావు అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన మొత్తం నాలుగు అర్జీలు అందాయని ఆర్డీవో తెలిపారు. వాటిలో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 3, మున్సిపల్ డిపార్ట్‌మెంట్ సమస్య ఒకటి వంతున అందాయన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి సోమవారం నిర్వహించనున్న పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించడంతోపాటు వెంటనే ఆ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామంలో సత్యమ్మ అమ్మవారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం సోమవారం జరిగింది. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో అమ్మవారి ఆలయంలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. అమ్మవారికి 89 రోజుల హుండీ ఆదాయం రూ. 11,08,592 వచ్చిందని ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పలు ఆలయాలకు చెందిన ఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఎం ఫుల్ స్టాక్ టెక్నాలజీ ఎంతో ఉపయోగం

మైలవరం: ఎంఈఎం ఫుల్ స్టాక్ టెక్నాలజీ విద్యార్థులకు డీకోడింగ్ నైపుణ్యాన్ని పెంచడానికి ఎంతో ఉపయోగపడుతుందని బిజ్‌ట్రాన్ సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఆర్.అభిషేక్, కె.కిరణ్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, సీఎంఎం, ఏఐ అండ్ డీఎస్ విభాగాల ఆధ్వర్యంలో మెర్న్ ఫుల్‌స్టాక్ టెక్నాలజీస్ అనే అంశంపై తృతీయ సంవత్సరం విద్యార్థులకు మూడు వారాల ట్రైనింగ్ ప్రోగ్రామ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ ఇండస్ట్రీలో కొత్తగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఆయా విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి డాక్టర్ డి.వీరయ్య డాక్టర్ ఎస్.జయప్రద, డాక్టర్ ఓ.రమాదేవి కన్వీనర్లుగా వ్యవహరించారు. డాక్టర్ వై.విజయ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఎస్.నాగార్జునరెడ్డి కోఆర్డినేటర్లుగా, కె. వెంకటేష్, ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, షేక్ రెజీనాబేగం కో–కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



తిరువూరు: పేద కుటుంబానికి చెందిన ఇరువురు విద్యార్థులకు దుక్కిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐఐటీ ఫౌండేషన్ పుస్తకాలను సోమవారం వితరణగా అందజేశారు. పట్టణానికి చెందిన దుబ్బాకు దుర్గారావు కుమారులు జతిన్, దీపక్‌ల విజ్ఞప్తి మేరకు రూ.8వేల విలువైన ఐఐటీ ఫౌండేషన్ పుస్తకాలను ఫౌండేషన్ వ్యవస్థాపకులు దుక్కిపాటి మురళీకృష్ణ, కాశీవరప్రసాద్ వారికి అందజేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, పర్వతం శ్రీనివాసరావు, తుక్కూరి సుధాకర్, ఊటుకూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై సుందరకాండ పారాయణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై సోమవారం హనుమాన్ జంక్షన్‌కు చెందిన ముముక్షు భజన మండలిచే సుందరకాండ పారాయణ జరిగింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు భజన మండలికి చెందిన సులోచన బృందం సుందరకాండను ముక్తకంఠంతో ఆలపించారు. అమ్మవారిని దర్శించుకుని ఆరు బయటకు వచ్చిన భక్తులు కళావేదిక వద్ద జరుగుతున్న పారాయణను ఎంతో ఆసక్తితో విని పులకించారు. సుందరకాండ పారాయణతో పాటు హనుమాన్ చాలీసా, శ్రీ విష్ణు, లలితా సహస్ర నామ పారాయణ, శ్రీ భగవద్గీత పారాయణ, అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం భక్త బృందంలోని భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

నారు ఆరోగ్యమే కీలకం

- నారుమడి నేల మెరకలో ఉండాలి
- సారవంతమైనదిగా ఉంటే మేలు
- కలుపు యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



వరి నారుమడి

పెనుగంచిప్రోలు: వరి పైరులో ఖర్చులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవటానికి ఆరోగ్యకరమైన నారు ఎంతో కీలకం. నారుమడిని ఆరోగ్యకరంగా పెంచటానికి నేల తయారీ నుంచి ఎంతో జాగ్రత్త అవసరం. వరి పైరు నారుమడులు, కలుపు యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులను వ్యవసాయ శాఖ ఏడీఏ భవాని వివరించారు. నారుమడి వేయటానికి ఎంచుకున్న నేల పొలానికి మెరకలో ఉండి సారవంతమైనదిగా ఉండాలి. వేసవిలో పొలాన్ని దున్ని కలుపు లేకుండా ఉంచుకోవాలి. వీలైనంత వరకు బాగా చివికిన సేంద్రీయ ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నుకోవాలి. తద్వారా వేరు వ్యవస్థ ధృఢంగాను, నారు పీకేటప్పుడు తెగిపోకుండా ఉంటుంది. మొక్కకు కావాల్సిన అన్ని పోషకాలు అంది నారు ఆరోగ్యంగా పెరుగుతుంది. నారుమడిని 10–12 రోజుల వ్యవధిలో 3 దఫాలుగా దమ్ము చేసి చదును చేసి, నీరు పెట్టటానికి, తీయటానికి వీలుగా కాలువలు తీసుకోవాలి.

విత్తటం..

5 సెంట్లు నారుమడి ఒక ఎకరానికి సరిపోతుంది. లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున కార్బండిజమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు ఒక ఆకు పూర్తిగా పురి ఇచ్చుకునే వరకు ఆరుతడులు ఇచ్చి, తరువాత పలుచగా నీరు పెట్టాలి. మెట్ట నారుమడికి కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్‌ను కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవచ్చు.

పోషక యాజమాన్యం..

ఎకరం నారుమడికి 6 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్, 1.5 కిలోల మ్యూరేట్ పొటాష్ ఎరువులను దమ్ములు చేసేటప్పుడు వేసుకోవాలి. 2 కిలోల యూరియాను విత్తనం చల్లే ముందు మరో కిలో యూరియాను, విత్తిన 12–14 రోజులకు వేసుకోవాలి. దీనిద్వారా నారు ధృఢంగా పెరుగుతుంది. మెట్ట నారుమళ్లలో ఇనుప ధాతు లోపం సాధారణంగా కనబడుతుంది. ఈలోపం ఏర్పడినప్పుడు లేత చిగురాకులు తెల్లగా మారి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఇటుక రంగు మచ్చలు వచ్చి ఆకులు నిర్జీవంగా మారతాయి. ఎత్తు, పిలకలు తగ్గిపోతాయి. దీని నివారణకు లోప లక్షణాలను గుర్తించిన వెంటనే లీటరు నీటికి 20 గ్రాముల అన్నభేది, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

దంప నారుమడిలో కలుపు యాజమాన్యం..

సాధారణంగా చిన్న కమతాల వారు నారుమడికి మనుషుల చేత కలుపు తీయించుకోవచ్చు. కొన్ని సందర్భాలలో కూలీల సమస్య అధికంగా ఉన్నప్పుడు పెద్ద కమతాల వారు నారుమడులకు రసాయనాల ద్వారా కలుపు నివారించుకోవచ్చు. విత్తిన 3 నుంచి 5 రోజుల్లో మడిలో నీరు పలచగా ఉన్నప్పుడు ఎకరం వైశాల్యంలో ఉన్న నారుమడికి 35 గ్రాములు ఆక్సాడయార్జిల్ 80 శాతం ముందుగా అర లీటరు నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని 20 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో సమానంగా చల్లాలి. మందు చల్లిన రెండు రోజుల వరకు నీరు పెట్టకూడదు.

నారుమడి విత్తిన 15వ రోజు పొలంలో ఊద, గడ్డిజాతి మొక్కలు ఉంటే ఎకరాకు 400 మి.లీ సైహలోఫాస్ బ్యూటైల్ 10 శాతం ద్రావకం 200 మి.లీ నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి(అనగా లీటరు నీటికి 2 మి.లీ చొప్పున). ఈ మందు స్ప్రే చేసిన వారం రోజుల్లో ఊద, గడ్డిజాతి మొక్కలు మాత్రమే నశిస్తాయి. నారుమడిలో ఊద, గడ్డిజాతి మొక్కలతో పాటు పిచ్చి మొక్కల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరం వైశాల్యం ఉన్న నారుమడికి 80 మి.లీ బిస్‌పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. (లీటరు నీటికి 0.4 మి.లీ చొప్పున). ఈమందు స్ప్రే చేసిన వారం రోజుల్లో ఊద, ఆకుజాతి మొక్కలు చనిపోతాయి.

మెట్ట నారుమడి..

విత్తిన వెంటనే 2, 3 రోజుల్లో మెట్ట నారుమడిలో కలుపు నివారణకు వరి విత్తనాలు చల్లి భూమిలో కలిపి (విత్తనం మడి మీద కనిపించరాదు) తడిపిన తరువాత వెంటనే ఎకరం వైశాల్యం ఉన్నవారు మడిలో పెండిమిథాలిన్ 30 శాతం ద్రావకం(లీటరు నీటికి 5 మి.లీ చొప్పున) వాడుకోవాలి. లేదా ఎకరాకు 400 మి.లీ ప్రిటిలాక్లోర్ 50 శాతం ద్రావకం (అనగా లీటరు నీటికి 2 మి.లీ చొప్పున) ఏదో ఒకదానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మందు స్ప్రే చేసిన 2, 3 రోజుల వరకు తడి పెట్టకూడదు.

అన్ని రకాల కలుపు మొక్కలు ఉంటే..

నారు విత్తిన 15వ రోజున నారుమడిలో గడ్డిజాతి మొక్కలు మాత్రమే ఉంటే ఎకరా వైశాల్యానికి 400 మి.లీ సైహలోపాప్ బ్యూటైల్ 10 శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. (అనగా లీటరు నీటికి 2 మి.లీ చొప్పున). అన్ని రకాల కలుపు మొక్కలు ఉన్నప్పుడు ఎకరా వైశాల్యానికి 80 మి.లీ బిస్‌పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. (లీటరు నీటికి 0.4 మి.లీ చొప్పున).

కలుపుమందు వాడకంలో జాగ్రత్తలు..

సిఫార్సు చేసిన మందును, సిఫార్సు చేసిన మోతాదులో, సిఫార్సు చేసిన సమయంలోనే వాడాలి. లేకపోతే నారుకు నష్టం కలుగుతుంది. మందు స్ప్రే చేసిన తరువాత 2 రోజుల వరకు నీరు పెట్టకూడదు. భూమి పొడిగా ఉన్నప్పుడు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు రసాయన మందులు స్ప్రే చేస్తే మంచి ఫలితాలు రావు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి



విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేసుకోవాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ, లేదా క్లోరిపైరిపాస్, 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి విత్తిన 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేసుకోవాలి. లేదా నారు తీయటానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాములు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి చల్లుకోవాలి.

–భవాని, ఏడీఏ

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీటీసీ సభ్యుడు వెల్ది ప్రభాకరరావు అన్నారు. సోమవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం, బ్యాగ్, బెల్ట్‌లతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోరంపుల పూర్ణయ్య, కె. జ్యోతి, కరిముల్లా, గ్రామ నాయకులు వెల్ది శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సుబ్బాయిగూడెంలో కిట్లు అందజేస్తున్న ఎంపీటీసీ ప్రభాకరరావు, ఉపసర్పంచి పూర్ణయ్య

ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం నుంచి మంజూరైన విద్యా కానుక కిట్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మణి హుస్సేన్, ప్రధానోపాధ్యాయురాలు మంగతాయారమ్మ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కిట్లు స్వీకరించిన విద్యార్థులతో ఎమ్మెల్యే

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో డీపీఆర్‌టీయూ నాయకులు

గనిఆత్కూరు(కంచికచర్ల): మండలస్థాయిలో 2023–2024 సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ రికగ్నైజెడ్ టీచర్స్ యూనియన్ (డీపీఆర్‌టీయూ) సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు డీ శ్రీను పేర్కొన్నారు. మండలంలోని గనిఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులతో పాటు ఎంఈఓ బీ బాలాజీని డీపీఆర్‌టీయూ నాయకులు శాలువాలతో సత్కరించారు. 'ప్రభుత్వ పాఠశాలల విజయభేరి' అనే కార్యక్రమంలో భాగంగా మండలంలో గనిఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 87 శాతం పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించటంతో మండలంలో మొదటి స్థానం దక్కించుకోవటం సంతోషమన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం వల్లే పాఠశాలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారన్నారు. విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల కృషి వల్లే అత్యుత్తమ ఫలితాలు సాధించటం జరిగిందన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల శ్రద్ధతో ఉండి మంచి మార్కులు వచ్చేలా చూడాలని శ్రీను అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఓంకార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ తొలగించాలని అధికారులపై ఒత్తిడి

నూజివీడు: దిగవల్లిలో మురుగునీరు వెళ్లేందుకు మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను తొలగించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి రావడంతో మంత్రితో తీవ్ర ఒత్తిడి తీసుకువస్తుండటంతో ఏం చేయాలో తెలియక అధికార వర్గాలు తలలు పట్టుకుంటున్నారు. గ్రామంలోని రజకుల ప్రాంతంలో మూడేళ్ల క్రితం మురుగునీరు వెళ్లేందుకు డ్రెయినేజీ నిర్మించడానికి ఏర్పాట్లు చేయగా, అప్పట్లో టీడీపీ నాయకుడు తన స్థలంలో డ్రెయినేజీ నిర్మించడానికి వీల్లేదంటూ అడ్డుకోవడంతో దాదాపు 50 మీటర్ల పొడవునా పంచాయతీ ఆధ్వర్యంలో భూమిలో పైప్‌లైన్ ఏర్పాటు చేసి మురుగునీరు వెళ్లేలా ఏర్పాటు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నాయకుడు భూమిలో వేసిన పైప్‌లైన్‌ను తొలగించాలంటూ మంత్రితో అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. అంతేగాకుండా పైప్‌లైన్‌కు అడ్డుగా మట్టిని పోసి మూసివేయడంతో మురుగునీరంతా అక్కడే నిలిచి ఉంటోంది. ఈనెల 22న పైప్‌లైన్‌ను తొలగించాలని ప్రయత్నించగా స్థానికులందరూ అభ్యంతరం చెప్పడంతో వెనక్కు తగ్గి మరల అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, రూరల్ ఎస్సైలు కూడా పైప్‌లైన్ ప్రాంతానికి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించి వచ్చారు. రోడ్డు స్థలమంతా వారి సొంతమంటూ అధికారుల వద్ద వాదన చేస్తుండటంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అరవై ఏళ్లకు పైగా ఉన్న ఇక్కడి రోడ్డుపై స్థానికులంతా రాకపోకలు సాగిస్తుంటే అధికారం వచ్చిన దగ్గర నుంచి తమదంటూ గొడవకు దిగడంపై అక్కడి వాళ్లు ఆందోళన చెందుతున్నారు.



మురుగునీరు వెళ్లకుండా మట్టి పోయడంతో ఆగిన మురుగునీరు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కంచికచర్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టామని సర్పంచి వేల్పుల సునీత పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్‌నగర్, అరుంధతీనగర్‌లలో సోమవారం బ్లీచింగ్, సున్నం చల్లించారు. ఈ మేరకు సర్పంచి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్ల ఆవరణలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. లేకపోతే దోమలకు ఆవాసకేంద్రాలుగా మారి అవి కుడతాయన్నారు. దీంతో రోగాలబారిన పడతామన్నారు. కాల్వల్లో మురుగునీరు పారుదల కోసం చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని తెలిపారు. బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని చెప్పారు. త్వరలోనే దోమల నివారణకు ఎబేట్‌ను పిచికారీ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీ బ్రహ్మం, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌నగర్‌లో శానిటేషన్ పనులు చేయిస్తున్న సర్పంచి సునీత

సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి

తిరువూరు: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పులిచింతల ప్రాజెక్టును పూర్తి చేసి ఆయకట్టు రైతుల భూములకు సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ కోరారు. తిరువూరులో సుంకర వీరభద్రరావు భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అందజేస్తామన్న సాగు పెట్టుబడి రూ.20వేలు వెంటనే బ్యాంక్ అకౌంట్‌లకు జమ చేసి వ్యవసాయ అవసరాలు తీర్చాల్సి ఉందన్నారు. గోదావరి జలాలతో మెరక ప్రాంతాలకు సాగునీటి సరఫరా మెరుగుపర్చి భూములను సస్యశ్యామలం చేయాలన్న ప్రతిపాదనతో చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోయాయన్నారు. షేక్ నాగుల్‌మీరా, తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఏఐవైఎఫ్ అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో మాట్లాడుతున్న శంకర్

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఆర్ఆర్‌లో 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' సెల్ఫీ కాంటెస్ట్
- విజేతకు రూ. 5వేలు నగదు బహుమతి

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాదక ద్రవ్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మాచవరం పీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా వినూత్నంగా 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమని అన్నారు. అలాగే నార్కోటిక్ డ్రగ్స్ ఎన్‌డీపీఎస్ చట్టం మాదకద్రవ్యాల నేరాలను చాలా తీవ్రంగా పరిగణిస్తుందని శిక్ష, జరిమానాలు కఠినంగా ఉంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా తమ విద్యార్థులకు మంచి విషయాలు తెలియజేస్తున్న నవజీవన్ బాల భవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు విజయవాడ, పరిసర ప్రాంతాల్లో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ విద్యార్థులతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల సెల్ఫీలను లక్కీటిప్ ద్వారా ఎంపిక చేసి విజేతకు రూ. 5వేలు నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాల నిర్మూలనకు అంతఃకరణ శుద్ధితో పాటుపడతామని, విజయవాడ సిటీని డ్రగ్ ఫ్రీ సిటీగా ఉంచేందుకు అందరూ సహకరిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు.



మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఏవీ శ్రీనివాస్

గాయపడిన విద్యార్థికి ఆర్థిక సాయం

ఆగిరిపల్లి: ప్రమాదంలో గాయపడిన విద్యార్థికి ఆగిరిపల్లి మండల ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విజయవాడకు చెందిన బీటెక్ విద్యార్థి మురారి జగన్ సాయి వైద్య ఖర్చుల నిమిత్తం ఆగిరిపల్లి మండల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ సభ్యులు రూ.65 వేలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శామ్యూల్, సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి, మాజీ ప్రధానోపాధ్యాయురాలు సుజనకుమారి చేతుల మీదుగా మురారి జగన్ సాయి తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శామ్యూల్ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఏలూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తాడి నరసింహారావు, జిల్లా కార్యదర్శి అబ్దుల్ హక్, మండల అధ్యక్షుడు మక్కే వేణుగోపాలరావు, ఎస్టీయూ సంఘం సీనియర్ నాయకులు చౌటపల్లి సురేష్ కుమార్, అంకం వెంకటేశ్వరరావు, కొవ్వలి కోటమ్మ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రమాదంలో గాయపడిన విద్యార్థికి రూ.65 వేలు సాయం అందజేసిన మండల ఎస్టీయూ నేతలు

రేపు కొబ్బరి చిప్పల సేకరణ హక్కులకు వేలం

నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామంలో శ్రీ సత్యమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తులు కొట్టిన కొబ్బరి చిప్పలను సేకరించుకునేందుకు ఈనెల 26న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. సీతారామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆలయం వద్ద భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

వీరులపాడు: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని సర్పంచ్ మారపాక మహాలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, యూనిఫాం, బూట్లను సోమవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా ప్రభుత్వ పాఠశాలల్లో సైతం విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, సాంబిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

నందిగామ: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యరేణుక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో బాల్యవివాహాలు, హక్కులు, బాలికలపై జరుగుతున్న హత్యాచారాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడం వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు

నూజివీడు: ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్ సదుపాయాన్ని కల్పించనున్నారని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో సొంత భవనాలున్న ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, వసతి గృహాల వివరాలను ఈనెల 26లోగా తెలియజేయాలని ఈఈ సత్యనారాయణ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. భవనం విద్యుత్ మీటరు సర్వీసు నంబరు, లోడు వివరాలు, భవనం పైభాగం విస్తీర్ణం, ఆవరణ విస్తీర్ణం వివరాలను ఏఈకి, లైన్‌మెన్‌కు తెలియజేయాలని పేర్కొన్నారు.

30న ఉచిత వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం(మైలవరం): మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్, ట్రామా సెంటర్‌లో ఈ నెల 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులో వైద్యులు తబీష్ సయ్యద్, మామిడి రత్నమోహనరావు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షలు చేయించుకోదలచిన వారు ఈ నెల 28వ తేదీలోగా ఇబ్రహీంపట్నంలోని ట్రామా సెంటర్, సెల్ 81254 54979, 90003 28353లలో సంప్రదించాల్సిందిగా కోరారు. ఎముకల సాంద్రత పరీక్ష, ఈసీజీ, ఆర్‌బీఎస్, లిపిడ్ ప్రొఫైల్ తదితర పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

నేడు ఎన్టీటీపీఎస్ ఉద్యోగులకు నేత్ర పరీక్షలు

ఇబ్రహీంపట్నం(మైలవరం): మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలోని నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రంలో ఈ నెల 25వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అయాన్ ఐ హాస్పిటల్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అయాన్ ఐ హాస్పిటల్ డాక్టర్ బషీర్ అహ్మద్ మయూఖ్ నేతృత్వంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటికి సంబంధించిన అన్ని సమస్యలపై అధునాతన వైద్య యంత్ర పరికరాల ద్వారా వైద్యులు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు తెలిపారు.